# అధవా

ఉదయం దాటింది. మధ్యాహ్నం ఇంకా చిక్కబడలేదు. ఎండ పలచగా ఉంది. కొండమీంచి చల్లటిగాలి వీస్తోంది. పట్టణప్రజలకన్నా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు రాజప్రసాదానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రాంగణానికి ముందుగా చేరుకుంటున్నారు. ప్రాంగణం నెమ్మదిగా క్రిక్కిరిసి పోతోంది.

ఆ ప్రాంగణాన్ని మునుపు రకరకాల ఆటలు ఆడడానికి ఉపయోగించేవాళ్ళు. ఒక సమయంలో అది మల్లయుద్ధాలకు కేంద్రంగా ఉండేది. క్రమంగా అది వధ స్థలంగా మారిపోయింది. ఎప్పుడోగాని అది పెళ్ళిళ్ళకు నోచుకోదు. వధ అంటే ఎప్పుడోగాని తల తీసేయడం జరగదు. చాలాసార్లు మహారాజు జంతుశాలలోని పులిని దోషిగా నిర్ణయించబడిన వ్యక్తి మీద వదిలి పెడతారు. ఎంతోమంది చూస్తుండగా దోషిని తినేస్తుంది. అది కాకుంటే మరొక శిక్ష దోషికి అతని వయసుకు తగిన స్త్రీతో పెళ్ళి చేయించడం, అతనికి అంతకుముందు పెళ్ళయి పిల్లలున్న వాడయినా సరే. ఈ రెండింటిలో ఏదో ఒకటి. చావో బతుకుగా అతని అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. ఇది కేవలం పురుషులకే వర్తిస్తుంది. స్త్రీలకు కాదు.

దోషి పులివాత పడినప్పుడు చూడడానికి వచ్చిన ప్రజలు దుఃఖంతో తలలు వంచుకుని బాధపడుతూ వెళ్ళిపోతుంటారు. అలా కాకుండా పెళ్ళి జరిగితే సంతోషంతో పాటలు పాడుతూ భోజనాలు చేసి గాని ఆనందంగా వెళ్ళరు. కనీసం నెలకు ఒకసారయినా ఈ తతంగం జరుగుతుంటుంది. ఈ కార్యక్రమం జరపడానికి ముందుఊరూరా దండోరా వేసి ప్రజలకు తెలియచేసి, సమీకరిస్తారు. ఇది దొంగలకు, హంతకులకు, వ్యభిచారులకు, స్త్రీలపయి అత్యాచారాలకు ఒడికట్టిన వాళ్ళకు వర్తిస్తుంది. ఒకసారి తప్పించుకుని మళ్ళీ అదే తప్పిదం చేస్తే ఆ వ్యక్తిని ఆ స్థలంలోనే వధించేస్తారు. దీనివలన అప్పుడప్పుడు అమాయకులు బలయిపోవడం జరుగుతున్నా రాజ్యంలో దొంగతనాలు, హత్యలు, వ్యభిచారం, స్త్రీల మీద అత్యాచారం, భ్రూణహత్యలు చాలా మటుకు తగ్గాయి.

ప్రాంగణానికి ఉత్తర దిక్కున ఎత్తయిన చోట మహారాజు కూర్చుంటాడు. యువరాణి, మహారాణి చెరొక పక్కన కూర్చుంటారు. మహారాజుకు కుమారులు

బి.పి.కరుణాకర్

లేరు. వాళ్ళకు కొద్ది దూరంలో ఒక మెట్టు కింద మంత్రులు కూర్చుంటారు. సరిగ్గా వాళ్ళు కూర్చునే చోటు కింద మూడు గదులు ఉన్నాయి. ఒక గదిలో పెళ్ళికి సిద్ధమయి సింగారించుకున్న వధువు ఉంటుంది. మధ్యగదిలో పెళ్ళి జరిపించే పూజారి మందీ మార్బలంతో, మేళతాళాలతో, పూల దండలతో సిద్ధంగా ఉంటాడు. మూడోగదిలో ఆకలితో ఉండే పులి ఉంటుంది. పులి అరుపులు బయటకు ఏ మాత్రం వినిపించనీయకుండా కట్టు దిట్టంగా భూమిలో ఉన్న రహస్యపు అరలో ఉంచి అవసరమయినప్పుడు ఆ అరలోంచి గదిలోకి వదిలిపెడుతుంటారు.

దోషిగా నిర్ధారించబడిన వ్యక్తిని మహారాజు కూర్చున్న చోటుకు ప్రాంగణంలో ఎదురుగా నిలబెట్టిన తర్వాత మహామంత్రి లేచి ముందుకు రాగానే ప్రాంగణమంతా నిశ్శబ్ద మయిపోతుంది. కంచె చుట్టూ ఉన్న ప్రజాసమూహం ఊపిరి తీసుకోవడం మానేసినట్టుటుంది. మహామంత్రి దోషి గురించి ప్రజలకు వివరించి అతని చేసిన నేరం చెప్పి, "ఈ శిక్ష మీకు సమ్మతమేనా?" అని మూడుసార్లు ప్రజలను అడుగుతాడు.

సమ్మతమయినా, కాకపోయినా "మాకు సమ్మతమే" అని ప్రజలు అనవలసి వస్తుంటుంది. మహామంత్రి ప్రకటన కాగానే దోషి కుడివయిపు తలుపుగాని, ఎడమవయిపు తలుపుగాని తెరవవచ్చు. అతను రక్షించబడవచ్చు. భక్షించబడవచ్చు. అది అతని అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. పూజారి ఉండే గది తప్ప పులి, వధువులు ఉండే గదులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఏ గదిలో వధువు ఉందో, ఏ గదిలో పులి ఉందో రాజకుటుంబీలకు తప్ప వేరెవ్వరికీ తెలియనివ్వరు.

ఆ రోజు అభియోగం చేయబడిన వ్యక్తి సంజీవికి ఇరవయి మూడు సంవత్సరాలకు మించి ఉండవు. పచ్చటి శరీరం, స్ఫురద్రూపి. అంత అందమయినవాడు దోషిగా అక్కడ నిలబడడం అక్కడి ప్రజలు చూడడం అదే మొదటిసారి. 'ఏమవుతుందో, ఏమో' అని చాలామంది అనుకున్నారు. సంజీవి చేసిన నేరం వినిపించడానికి మహామంత్రి రాజకుటుంబీకుల కోసం ఎదురు చూస్తున్నాడు.

సంజీవి అంతఃపురంలో యువరాణికి అంతరంగిక రక్షకుడిగా గత మూడు సంవత్సరాలుగా కొలువు దీరి ఉన్నవాడు. అన్ని విద్యల్లో ఆరితేరిన అతని గురించి మహారాజు వినడమే కాని అతన్ని ఎప్పుడూ చూడలేదు. నిజానికి యువరాణి సంజీవిని మహారాజు కంటపడకుండా చూసింది. అతన్ని ఎన్నుకుంది కూడా తనే. రాజ భటుల్లో కూడా అతనంటే గౌరవం ఉంది. ఎవరికేమి కష్టం వచ్చినా యువరాణి చేత చెప్పించి సరిచేయించేవాడు. మహారాజు యువరాణి మాటకు విలువ ఇచ్చేవాడు.

సంజీవి ఆమెకు గుర్రపుస్వారీ, ఈత, కర్రసాము, కత్తిసాము ఒకటేమిటి, ఆమెకు నేర్పని విద్యలేదు. మల్లయుద్ధం నేర్పేటప్పుడు మాత్రం అతను ఆమెనుండి తప్పించుకోలేకపోయాడు. యువరాణి నివాసంలోకి సంజీవి రాకపోకలు నిషిద్ధం కాదు. నిజానికి రోజులో ఎక్కువసేపు ఆమెతోనే ఉండేవాడు. ఒకరికొకరు అలవాటయిపోయారు.

ఈ విషయం మహారాజుకు తెలిసేసరికి బాగా ఆలస్యం అయింది. సంజీవిని ఏదయినా చేసేముందు ఒకసారి యువరాణితో మాట్లాడదామని అనుకున్నాడు. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో ఎంత ఆలోచించినా ఏం తట్టలేదు. మహారాజుకు యువరాణి అంటే ఎంతో ఇష్టం. మాట్లాడలేకపోయాడు. మహారాణితో ఈ విషయం సంప్రదించడానికి అభిమానం అడ్డుతగిలింది. ఆగిపోయాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకొని అయిదు సంవత్సరాలు దాటాయి. ఆనవాయితీకయి ప్రజలముందు రాజకొలువులో, ముఖ్యమయిన సభల్లో పక్క పక్కన నుంచుంటారు. వేడుకల్లో పాల్గొంటారు. కలిసి భోజనం చేస్తారు. అంతే. ఒకరి శయన మందిరానికి మరొకరు వెళ్ళరు. తల్లిదండ్రులను కలపడానికి యువరాణి ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఏవీ ఫలప్రదం కాలేదు. వదిలిపెట్టేసింది.

మహారాజు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సంజీవిని కారాగారంలో వేయించాడు. శిక్ష కూడా ఖరారు చేశాడు. శిక్ష అమలు చేస్తున్న ఉదయమే యువరాణికి ఆ విషయం తెలిసి అతన్ని కలుసుకోడానికి ఎంతో ప్రయత్నించింది. వీలు కాలేదు. అంతకు ముందు రోజు సంజీవి తన మందిరానికి రాకపోయేసరికి మహారాజు సంజీవిని ఏ అత్యవసర పనిమీద ఎటయినా పంపించి ఉంటాడని అనుకుంది కాని అలా బంధించబడ్డాడని ఊహించలేదు. మనసు కల్లోలమయింది. ఏం చేయాలో, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాలేదు. తండ్రి కాళ్ళమీద పడి సంజీవినిని క్షమించి వదిలేయమని అడుగుదామని అనుకుంది. అడగలేకపోయింది. బాధను మనసు దాటనీయలేదు.

ఆ ఉదయం వధువును అలంకరిస్తున్న గదిలోకి వెళ్ళింది యువరాణి. అప్పటికే వధువు అలంకారం చాలామటుకు పూర్తి అయింది. వధువు కుందనపు బొమ్మలా తనకంటే చక్కగా ఉంది. తన మెడలోని తనకు ఎంతో ఇష్టమయిన రవ్వల నగ తీసి వధువు మెడలో వేసి ఆమె బుగ్గలను పుణికి పుచ్చుకుని, "నువ్వు చాలా అదృష్టవంతురాలివే" అంది. అంటూ వస్తున్న కన్నీళ్ళను బలవంతంగా ఆపుకుంది.

ఆ నగ అంటే సంజీవికి ఎంతో ఇష్టం. ఆ నగ తప్ప తన వంటి మీద ఏమీ ఉండనిచ్చే వాడు కాదు.

మహారాజు, మహారాణి, యువరాణి తమ స్థానాల్లో కూర్చున్నాక, మహారాజు అనుమతితో మహామంత్రి లేచి, ముందుకు వచ్చి క్రిక్కిరిసి ఉన్న జన సమూహాన్ని ఉద్దేశించి, “సంజీవి అనే ఈ అనాథ పంచముడు రాజ ద్రోహం చేశాడు. అంతః పురంలోని ఒక క్షత్రియ యువతిని అత్యాచారం చేయబోయి పట్టుబడ్డాడు. అందుకు ఈ శిక్షకు అర్హుడని మహారాజా వారు నిర్ణయించారు. ..” అని మహారాజు వంక చూశాడు. అవునన్నట్లు మహారాజు తలూపి కుడిచేయి పయికెత్తాడు. ఆ క్షత్రియ యువతి ఎవరో, పేరేమిటో మహామంత్రికి తెలియదు. మహారాణికి తెలుసు. గట్టు గడప దాటలేదు.

ఎప్పటిలా మహామంత్రి, ‘ఈ శిక్ష వేయడం మీకు సమ్మతమేనా?’ అని ప్రజలను అడగలేదు. పంచములకు కొన్ని నిబంధనలు వర్తించనీయరు, చావులో కూడా.

మహామంత్రి సంజీవి వంక చూసన్తూ, “ఈ నేరారోపణను నువ్వు ఒప్పుకుంటున్నావా?” అడిగాడు.

సంజీవి తలూపాడు.

“తలూపడం కాదు, మాటల్లో చెప్పు.”

“అవును. నేను పొరపాటు చేశాను. శిక్షార్హుడిని” నిబ్బరంగా అని యువరాణి వంక చూశాడు. అతనికి ధైర్యం ఏ మాత్రం సడలలేదు. ‘చివరి క్షణంలో యువరాణి అనూహ్యమయిన మహాత్మ్యంతో తననీ ఉచ్చునుండి తప్పిస్తుంది’ అని పదే పదే అనుకోసాగాడు.

“శిక్ష అమలు చేస్తున్నాం” అన్నాడు మహామంత్రి.

“మీ చిత్తం ప్రభూ” అన్నాడు సంజీవి.

యువరాణి కుడిచేయి నెమ్మదిగా పయికి లేచింది. తన జీవితం ఆమె చేతుల్లో ఉంది. ఏదయినా చేయగలదు. ఏం చేసినా తను ఇష్టపడతాడు. సంజీవి మనసుతేలిక అవుతోంది. యువరాణి చేయి నుదుటి మీదకు జరిగింది. అతని చూపులు ఆమె చేతి మీంచి మళ్ళించడం లేదు.

“చివరిగా నువ్వు చెప్పుకోవలసింది ఏమయినా ఉందా?” అడిగాడు మహామంత్రి.

“లేదు ప్రభూ”.

చాలామంది ఈ మాటకు జవాబు దుఃఖపడుతూ చెపుతారు. ఏదెలా జరుగుతుందో తెలియదు. సంజీవి అందరిలా కాకుండా సంతోషంగానే చెప్పాడు.

యువరాణి చేయి కుడిపక్కకు జరిగి ముంగురులు సవరించుకుని, కుడి వయిపు గది తలుపు తెరవకన్నట్టు సంజీవికి సంకేతం ఇచ్చింది. అంటే కుడి వయిపు గదిలో పులి ఉంది. అతని హృదయం సంతోషంతో పొంగి పొర్లసాగింది. యువరాణి తనకు అన్యాయం చేయదు. చేయలేదు. తనను ఎంతగా ప్రేమిస్తోందో తనకు తెలుసు.

తల వంచి ముందు యువరాణికి, తర్వాత మహారాజుకు, మహారాణికి ప్రణామాలు చేసి, చేతులు జోడించి చుట్టూ తిరిగి ప్రాంగణం చుట్టూ కంచెకు అవతల ఉన్న ప్రజలందరికీ నమస్కారాలు చేశాడు. ఎన్నో వేల మంది ప్రజలు ఉన్నా ఎవరూ లేనట్లు ఆ ప్రాంతం భయంకరమయిన నిశ్శబ్దంలో మునిగిపోయి ఉంది.

"ఇహ నువ్వు నీకు ఇష్టమయిన తలుపు తీయవచ్చు." మహామంత్రి అని వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు.

సంజీవికి అమితానందంగా ఉంది. మనసు గాలిలో తేలి పోతున్నట్టుగా ఉంది. అదృష్టం సంకేత రూపంలో వస్తుందని అతను అనుకోలేదు. యువరాణి వంక కృతజ్ఞతా పూర్వకంగా చూసి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఎడమప్రక్కన ఉన్న తలుపు గడియ తీశాడు. తలుపు తెరిచాడో లేదో ఆకలితో ఉన్న పులి ఎగిరి అతని మీదపడి గొంతు నోట కరుచుకుని ఆటస్థలం మధ్యలోకి ఈడ్చుకువచ్చింది. అతను అదరలేదు. బెదరలేదు. ప్రతిఘటించడానికి కూడా ప్రయత్నించలేదు. అతనికి పులిని వేటాడడం తెలుసు. ఒక్క చేత్తో పులిని ఎత్తి అవతల పడేయగలడు. అతనేం చేయలేదు. పులికి వశమయి పోయాడు. ప్రాణం పోయే ముందు మటుకు యువరాణి ముఖాన్ని చూద్దామని ప్రయత్నించాడు. వీలు కాలేదు.

ప్రజల హాహాకారాలతో, గుండెలు బాదుకుంటూ ఏడ్చిన వాళ్ళతో ప్రాంగణం మారుమోగింది. రాజభటులు కూడా కన్నీరు ఆపుకోలేక పోయారు. కంచెకు అవతల ఉన్న కొంతమంది పులి సంజీవిని తినేయకుండా అదిలించారు. పులి ఆగలేదు. ఆ విధంగా మునుపు ఎప్పుడూ జరగకపోవడంతో మహారాజు ఆలోచనల్లో పడ్డాడు.

ఆ సాయంత్రం చీకటి త్వరగానే పడి చాలా సేపయింది. మహారాజు, మహారాణి, యువరాణి గుండ్రటి భోజనాల బల్ల చుట్టూ కూర్చుని భోజనాలు చేయడానికి

ఉపక్రమించారు. మహారాణి ఏం మాట్లాడకుండా త్వరత్వరగా భోజనం చేసి లేచి తన శయన మందిరంలోకి వెళ్ళిపోయింది. గదిలో నిశ్శబ్దం, మహారాజు, యువరాణి మటుకు మిగిలారు. దీపాలు కూడా బాధతో వెలుగుతున్నట్టుగా ఉన్నాయి. మహారాజు అయిష్టంగా భోజనం చేస్తున్నాడు. యువరాణి వడ్డించిన భోజనాన్ని ముట్టుకోలేదు. పళ్ళరసం అడిగింది కాని తీరా తెచ్చాక తాగాలని అనిపించలేదు. మధ్యాహ్నం కూడా ఆమె భోజనం చేయలేదు. పచ్చి మంచి నీళ్ళయినా ముట్టుకోలేదు. తండ్రి పక్కన కూర్చోవడం ఇష్టం లేక లేచి వెళ్ళబోతుంటే,

"యువరాణీ, మాట" అన్నాడు.

ఆగింది.

"దయచేసి కూర్చో".

కూర్చుంది.

"నేను నీ ఎడల ద్రోహం చేశానా?"

"లేదు మహారాజా" అని కొద్దిక్షణాలు ఆగి, "మీరు మీ ధర్మాన్ని పాటించారు" నెమ్మదిగా అంది.

"సంజీవి ప్రజలకంత అభిమానని నేను ఊహించలేదు."

'సంజీవిచాలా మంచి వ్యక్తి. సున్నిత మనస్కుడు. ప్రేమ కలవాడు' అని అందామనుకుని మాటలు నోటి చివరికంటా వచ్చాయి. అనలేదు.

"అతనికి నువ్వు సంకేతం ఇవ్వడం నేను చూశాను."

యువరాణీ తల వంచుకుంది. కట్టలు తెంచుకుని వస్తున్న దుఃఖానికి ఎక్కడికక్కడ ముడులు వేస్తోంది. బాధను, గొంతు దాట నీయడం లేదు.

"పొరపాటు కావాలనే చేశాను" నెమ్మదిగా అంది.

"అలా చేయకుండా ఉండవలసింది. అతను పులి ఉన్న గదికాక వధువు ఉన్న గదితలుపు తెరిచి ఉంటే బతికి ఉండేవాడు కదా?"

"అవును మహారాజా" అని రెండు క్షణాలు మవునంగా ఉండి, "మహారాజా, సంజీవి నాకు కానప్పుడు మరెవ్వరికీ కాకూడదు. అంతే" అంది. అన్నాక దుఃఖం ఆపుకోలేకపోయింది. చేతులతో ముఖం కప్పుకుని చాలాసేపటివరకు ఏడుస్తూ ఉండిపోయింది.

(ఫ్రేంక్.ఆర్. స్టాక్టన్ 1884లో రాసిన ఇంగ్లీషు కథ చదివిన తర్వాత)

* ఆదివారం వార్త, 15 మే 2011